


**నాన్నా!!!**

చూశావా???

ఈరోజు నా పరిస్థితి... నిజమే నాన్నా!!! నువ్వన్నది... అక్షరాలా నిజం... ఈ బంధుత్వాలూ, రక్త సంబంధాలూ అన్నీ వట్టివే... అన్నీ వ్యాపార దృక్పథంలోకి మారిపోయాయి. ఈ కలిమిలేముల పోరాటంలో బంధాలన్నీ తమ తమ బంధాలు తెంచుకుని ఎటో పారిపోతున్నాయి. ప్రతి వారికీ నా అంతస్తు కావాలేగానీ... నన్ను నన్నుగా ఆదరించటం లేదు నాన్నా...

జీవితంలో తగిలే దెబ్బలకు కాలి మోచిప్పలు పగిలి రక్తం కారుతున్నాయి... అయినా...కుంటుతూ పడుతూ లేస్తూ... చిరునవ్వుతోనే నడుస్తున్నా.. కన్నీళ్ళు విజయానికి ఆటంకం అనే నీ మాటలను అక్షరాలా నమ్ముతూ... కన్నీళ్ళకు ఎంతగా వీడ్కోలు చెబుతూన్నా.. పరిస్థితులకు కన్నీళ్ళు ఆగటంలేదు నాన్నా... జీవితం అంతా ఎంతో ఒంటరిగా నిస్సారంగా అనిపిస్తోంది నాన్నా..!!!

అంటూ నాన్న మంచంపై తలగడపై తల పెట్టుకుని రోజంతా రోదిస్తూనే ఉన్నాను... సుమారు నలభై సం॥లు నాన్న నిదురించిన మంచంతో ఆవేదనలు తెలుపుకున్నాను.

ప్చ్! నా పిచ్చిగానీ.. మంచం నా ఆవేదనను తీరుస్తుందా? అయినా ఆ పాత కాలపు మంచం కిర్రుమని చప్పుడే నాకు ఓదార్పుగా భావించాను అంతలో....

"అమ్మా... అమ్మా" అనే నా కొడుకు పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాను...

"అమ్మా...ఏం చేస్తున్నావు? పిలుస్తుంటే పలకవేం?" అంటూ స్కూలు బ్యాగ్ నా కాళ్ళమీద దభీమని పడేశాడు.

తప్పదు.. కాళ్ళు నొప్పి పుట్టినా భరించాను.. ఏం చేద్దాం..! కడుపు తీపి... ఓపికతో ఆబ్యాగ్ తీసి షెల్ఫ్‌లో పెడుతూ.. "ఏంట్రా..ఏం కావాలి? చెల్లాయి ఏది?" అడిగాను.

"ఆ! నీకెప్పుడూ దాని ధ్యాసే.. నా గురించి ఎప్పుడూ పట్టించుకోవు.. అంటూ తన షర్టు తాను కష్టపడి విప్పుకుంటున్న బుజ్జిని ఒక్క దెబ్బ వేశాడు.... దాంతో బుద్ధిగా ఉన్న బుజ్జి గట్టిగా ఏడుపు లంకించుకుంది... అదీ తప్పదు.. దాన్ని ఓదార్చేందుకు చేతుల్లోకి తీసుకోక తప్పలేదు...

"అమ్మా...నాన్న ఇంకా రెండు టెక్స్ట్‌బుక్స్ కొనాలి... తర్వాత స్కూలు ఫీజు కట్టాలి"అంటూ ఏకరువు పెట్టాడు...

"సరేలే నాన్న రాగానే..." అనే మాట పూర్తి

కాకుండానే...

"ఇదిగో ఇలా ప్రతి సారీ నాన్న వచ్చాక, నాన్న వచ్చేక అని అంటే నేను ఊరుకోను... ఎప్పుడో పదకొండు పన్నెండు గంటలకు వచ్చే నాన్న నిద్రపోవటం తప్ప మా గురించి ఏం ఆలోచిస్తారు? రేపటి మా టీచెర్స్‌డేకి ఒక్కొక్కరు పదిరూపాయలు... 'చిల్డ్రన్స్ డే'కి ఒక్కొక్కరూ పది రూపాయలు ఇవ్వాలిట... చెల్లివి, నావి కలిపి నాకిచ్చేయి. ఎందుకంటే అది పారేస్తుంది" అంటూ ఆపాడు... డబ్బు విలువంతా కాచి వడబోసినట్టుగా...

నాకు నవ్వొచ్చింది.. సరే... ఏంచేస్తాం? తప్పుకోవడానికి దారేం కనబడటంలేదు... అంచేత మొన్న అమ్మ ఇచ్చి వెళ్ళిన వందలో నలభై రూపాయలు తీసి ఇచ్చాను... చేసేది లేక.

"అమ్మా నా కేదయినా పెట్టు ఆకలేస్తోంది..." అంది బుజ్జి వంటింటిలోకి వెళ్తూ...

"అన్నం పెట్టనా" అని అడిగాను బుజ్జిని దగ్గరకు తీసుకుంటూ...

"ఎప్పుడూ అన్నమేనా..? మాలతి వాళ్ళ ఇంట్లో సాయంత్రం అయ్యేసరికి వాళ్ళమ్మ బోల్డు వెరైటీలు తయారు చుస్తుందట. నువ్వేమో ఏమీ పెట్టవు...ఎప్పుడూ అన్నం...అన్నం అంటావు" అంది బుంగమూతి పెట్టుకుని.

సరే అంటూ చేసేదేంలేక ఉన్న దాంట్లో కాస్త అటుకుల ఉప్మా చేసి పెట్టాను... తర్వాత రెండు గంటల సేపు హోం వర్కు అంటూ కొంత దెబ్బలాటల్లో కొంత నన్ను మాటలతో.. చేతలతో విసిగించి వదిలారు.

"ప్చ్" తృప్తి అనేది ఎక్కడా ఉండటం లేదే.. పసితనం నుండి ఈ స్వార్థం ఏమిటి? నా పెంపకంలో లోపం ఉన్నట్లు లేదే... ఎక్కడుందీ లోపం? అనిపించి... నాన్న మంచంపై పడుం వాల్చాను..

"బిడ్డలు మనకు పూర్వ జన్మలోని శత్రువులు తల్లీ... కాస్త ఓర్చుకో.. లేదా కఠినంగా వాళ్ళ వైఖరిని మార్చివేయి..." అని హెచ్చరిస్తున్నట్లు ఆ పాత మంచం చప్పుడు చేసింది... నన్ను తన గుండెలపై పడుకోపెట్టుకుని...

✳ ✳ ✳

"రమా... రమా..." అనే దబ దబా తలుపు చప్పుడుతో ఉలిక్కిపడి లేచాను... "ఆ! వస్తున్నానండీ" అంటూ...

"ఏంటి? అప్పుడే అంత నిద్రా" అంటూ చిరాగ్గా లోపలికి వచ్చారు శ్రీవారు.

"అప్పుడే అంటారేంటండీ టైము పదకొండు దాటుతోంది"

"ఆ! ఆవిషయం నాకు తెలియదనుకున్నావా? నాకూ టైము అంతే అయ్యిందిగా నేను పడుకున్నానా? నీలా" అంటూ చేతిలోని ఏవో ఫైల్సు కాబోలు చేతికి అందించారు..


"పిల్లలు అన్నాలు తిన్నారా?" అడిగారు షర్టు విప్పుతూ.

"ఆ! తిన్నారు..." రాత్రి పదకొండు వరకూ ఇంకా పిల్లలకు అన్నం పెట్టకుండా పడుకోబెట్టాననా ఈయన ఉద్దేశ్యం అర్థంకావటం లేదు నాకు... అయినా.. అలాగని అర్థం వచ్చేలా ఏదయినా అన్నా ఇక్కడో ఉపన్యాసం.. తనేదో లోకాన్ని ఉద్ధరిస్తున్నట్లు.. నేనేమో ఇంట్లో రోజంతా నిద్రబోతున్నట్లు... ఛీ... అనుకుని ఊరుకున్నా. కాని.. అంతటితో ఊరుకోక బాత్‌రూమ్‌లోకి వెడుతూ బంగారు తల్లి అనుకుంటూ నిద్రబోతున్న బుజ్జిని ముద్దు చేసి నిద్ర లేపారు..

అదేమో.. అమ్మా... ఎవరు? అంటూ అరుపు. మళ్ళీ సర్ది నిద్రపొమ్మనే సరికి పదినిమిషాలు పట్టింది...

"రమా ఏంచేస్తున్నావు?"

"ఇదిగో బుజ్జిని..."






## బాలీవుడ్‌లో మరో కొత్త నటి

'తమిళనటి మధూ శర్మ తమిళంలో ఒక హిట్ చిత్రంలో నటించి ఆ తరువాత బాలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నంలో ఉంది. 'హమ్ హై ప్యార్ మే'లో రామ్ ఆస్‌రాతో నటిస్తోంది. తమిళంలో కంటే హిందీ చిత్రాల్లో నటించడానికి ఇష్టపడే ఈ భామ చదువుకున్నది మాత్రం ముంబాయిలోనే. భాషా సమస్య లేకపోవడంతో తాను బాలీవుడ్‌లో మంచి నటిగా నిలదొక్కుకునే అవకాశం ఉందని సంబర పడుతోంది. మధూ శర్మ, మధూ మోహన్‌తో నటించిన తమిళ సినిమాను తెలుగులోకి అనువదించబడింది. బెస్టాఫ్ లక్ మధూ.

"ఆ! ఇదో సాకు... అన్నం ఇలా చల్లగా తగలెయ్యకపోతే.. కాస్త వేడి చేసి ఏడ్వచ్చుగా.. అన్నీ చెప్పాలి... సంసారం చేసే లక్షణాలు వుంటేగా.. వెళ్ళు ఆచారైనా వేడిచేయి" అంటూ అరిచారు.

ప్చ్ ఏంచేయగలను చెప్పినట్లు చేసి పెడితే ఏదో నాకోసం తింటున్నట్లు తిని.. అయ్యిందనిపించారు... అంతా సర్దుకుని హమ్మయ్య ఈరోజు గడిచింది అనుకునే సరికి పన్నెండు అవ్వనే అయ్యింది..

✳ ✳ ✳

"రమా..."

"ఆ!"

"ఇంకా పని అవ్వలేదా?"

"అయ్యింది... ఇప్పుడే"

"మరి... ఏంచేస్తున్నావ్..."

"వస్తున్నా..." అంటూ వెళ్ళి ఒక వైపుగా తిరిగి పడుకున్నాను..

"రమా... అంతా నిద్రే... " అంటూ శ్రీవారు దగ్గరకు తీసుకునే ప్రయత్నం చేయబోయేంతలో...

సరేలెండి.. నాకు నిద్ర ముంచుకొస్తోంది.. [illegible] మళ్ళీ [illegible] [illegible]..

"నేనే నువ్వు అలా అంటే నేనేం అనగల్ను అయితే అసలు విషయానికొస్తా.." అంటూ లేచి కూర్చున్నారు శ్రీవారు.

విషయం నాకు చూచాయిగా అర్థం అయినా ఊరుకున్నా ఏమీ తెలియనట్టు...

"రమా నిన్న మీ అమ్మ వచ్చి వెళ్ళిందిగా... చనిపోయిన మీ నాన్న నీకేమయినా ఇచ్చారటనా?"

"ఆ ఇచ్చారు పాతికవేలు.." అన్నా సూటిగా..

"మరి ఆడబ్బుతో ఏం చేద్దామని."

"ఏం? మీరేమయినా చేద్దాం అనుకుంటున్నారా?"

"ఆ! అదే.. నీకేం కమిట్స్ మెంట్స్ లేకుంటే"

"ఏం చేద్దామని..?" కాస్త కరువుగానే అడిగాను..

"ఏం చేస్తానోయ్.. అయినా నీకు తెలియకుండా నేనెదయినా చేశావా? మన బిజినెస్ కాస్త డెవలప్ చేద్దామని.. "

"మొదట పెట్టిన అరవై వేలకి లేని డవలప్‌మెంట్ ఇప్పుడు ఈ పాతిక వేలకి ఎలా వస్తాయి..?"

"రమా! నువ్వలా అంటే ఎలా? నేనెంతగా కష్టపడినా మీ కోసమే కదా.... చూస్తావుగా నెల తిరిగే సరికి ఆ ఇరవై ఐదు వేలను లక్ష రూపాయలు చేయకుంటే..."

"ఇలానే మీరు ప్రతి స్సారీ చెప్పి... అప్పులు చేస్తున్నారు..."

"రమా నేనేం అప్పులు చేసినా మీ కోసమేగా..." అన్నాడు రాఘవ .

"నేను సంపాదించి పోషించమన్నానే గానీ... అప్పులు చేసి కాదు.."

"అబ్బా సరేలేవోయ్.. సాకు దొరికితే చాలు నీతులు బోధిస్తారు మీ ఆడవాళ్ళు... ఇంతకీ ఇస్తావా లేదా?" రెట్టించి అడిగారు...

'ప్చ్! ఏం చేస్తాను... ఇస్తే ఒక బాధ... ఇవ్వకుంటే ఒక బాధ... ఇచ్చి సాధించేది లేదు... ఇవ్వకుండా బావుకునేది లేదు' అనుకుంటూ.. "సరేలెండి" అన్నాను నింపాదిగా.

ఇక అంతే అతని సంతోషానికి అవధుల్లేకుండా.. నాకేవేవో కొనిస్తానని.. నాభవిష్యత్తుకు బంగారు బాట వేస్తానని వాగ్దానాలు చేశారు తెల్లవారి వరికైనా ఆగకుండా..

"ఇది నాకు అలవాటే...చిన్నతనం నుండి ఏదోవస్తుందని నన్ను ఆశ పెట్టేవాళ్ళే తప్ప... ఎవరో ఒకరు నన్ను నన్నుగా ఆదరిస్తారనే ఆశలేతప్ప ఏనాడూ నన్ను కనీసం మనిషిగా కూడా గుర్తించిన వాళ్ళు లేరు... అందుకే ఏదీ నాకు కొత్త కాదు.. ఎంత అంతకన్నా కాదు. ఇలాంటి విషయాల్లోనే నన్ను నేనున్నాను అంటూ నాన్న మంచం... ఓదార్పుగా నన్ను లాలిస్తుంది...

* * *

"అమ్మా! ...రమా"

"రండి బామ్మగారూ"

"ఏం చేస్తున్నావు? మీ వారు పిల్లలూ వెళ్ళేరా?"

"వెళ్ళేరండి.. అరగంట అయ్యింది. ఇంతకీ మీరు..."

"అదేనమ్మా.. మా కోడలు ఈరోజు వరలక్ష్మీ వ్రతం నోచుకుంటోంది... నీకు వీలయినప్పుడు అంటే, సాయంత్రం అయిదింటినుంచి ఎప్పుడయినా వస్తే..." అంటూ కుంకుమ పెట్టింది...

"తప్పకుండా బామ్మగారూ.... వస్తాను... కాఫీ తాగుతారా?" అంటూ అడిగాను...

"అబ్బే... అలాంటివేం వద్దమ్మా... మడికదా! పూజ అయ్యే వరకూ పచ్చి గంగ కూడా ముట్టను... వస్తానమ్మా..." అంటూ... చీర కుచ్చిళ్ళు ఎవరికీ తగలకుండా వెళ్ళిపోయింది...

* * *

"రండి... కూర్చోండి..." అంది రమను ఉద్దేశించి ప్రశాంతి.

"నేనే ఆఖరా.."

"కాదండీ ఇంకా ఎవ్వరూ రాలేదు... ముఖ్యంగా గోపాలరావుగారి వైఫ్. తర్వాత సీతమ్మగారు వచ్చేదాకా హారతి ఇవ్వంగా..."అంది ప్రశాంతి.

నాకయితే అసలు హారతి దేవుడి కోసమా? లేక డబ్బున్న వారి కోసమా అర్థం కాలేదు.. అయినా సరే వెనక్కు తిరిగి వెళ్ళటం ఇష్టం లేక వారందరూ ఒకళ్ళపై ఒకళ్ళు చెప్పుకునే నేరాలు... నగలు వాటి ఖరీదులు వింటూ కూర్చున్నాను... అంతలో ప్రశాంతి కోరుకున్న ఇద్దరూ రానే వచ్చారు. అందరూ లేచి వార్ని ఆహ్వానించి వారిముందరే హారతిచ్చి... వారు చెప్పే ఇంపోర్టెడ్ విషయాలు గొప్పలు విని సాదరంగా పంపించారు... ఇక తర్వాత మిగిలిన మాకు... తాంబూలం అందించి... ఈ మంగళసూత్రాలు ఎందుకిలా వున్నాయి? అసలుదా? నకిలీదా? నల్లపూసల గొలుసు ఇంత వరకూ కొనుక్కోలేదా? అని యక్ష ప్రశ్నలు వేసి సాగనంపింది.

పెళ్ళయి పన్నెండేళ్ళు కావొస్తున్నా... మంచి మంగళసూత్రమయినా చేయించలేని మా వారి తప్పా? నాకు ఎందుకు చేయించలేదని అడగలేని నా తప్పా? అర్థంకాని నాకు మళ్ళీ నాన్నమంచమే ఓదార్పునిచ్చింది... "బంగారంతో వచ్చే మర్యాద... పట్టుబట్టలతో వచ్చే మన్నన శాశ్వతం కాదమ్మా... నీకు నువ్వే.. వ్యక్తిగా గౌరవం సాధించాలి తప్ప... వ్యధ పడకూడదనే ఓదార్పు మాటలు గుర్తొచ్చి... నేను ఊరట పొందాను...

* * *

బిడ్డల నుండి సంజాయిషీ... భర్తనుండి అజమాయిషీ... సమాజం నుండి సంఘర్షణ... ఎప్పటికీ తప్పవా? ఎదుగుతున్న ఈ సమాజంలో వీటికి ఆటంకం లేదా? నిరంతరంగా మండుతున్న అగ్నిశిఖలా? అర్థంకాదు... ఇంత మాత్రపు జీవితానికి పుట్టుక... పునరుద్ధరణ అవసరమా? ఆత్మీయత లేని అమ్మతనం... ఏమయిపోతోంది?... అనురాగం పొందలేని ఆలిగా... ఎటుపోతున్నాను?

సంఘర్షణే ధ్యేయంగా ఎంచుకున్న సమాజంలో భవిష్యత్తు ఏమిటి?

అనే ప్రశ్నలకు సమాధానం ఎక్కడ్నించి ఎదురు చూడాలి???...

"ఎవరు చూసినా చూడకున్నా... నాకు ఓదార్పు ఉంది. లాలించే హృదయం ఉంది. జోకొట్టే చేతులున్నాయి.... విశ్రాంతినిచ్చే మనసుంది... నిరంతరం నన్ను అంటి పెట్టుకునే నాన్న మంచం ద్వారా...ఈ జన్మకు సరిపోయేటంత ఆదరణ చూస్తున్నాను. ఈతృప్తిలోనే బతుకుతున్నాను అనుకుంటూ... ఆమంచంపై వాలిపోయాను... తృప్తికి భాషలేదు... భావం లేదు...నన్ను నన్నుగా ప్రేమించే మనసు తప్ప...



## టీ.వి సీరియల్లో రచన

కలకత్తా రసగుల్లా రచన సినిమాల్లో అవకాశాలు లేకపోవడంతో మిగతా హీరోయిన్ల మాదిరిగానే టీ.వి సీరియల్స్‌పై మక్కువ చూపుతోంది. ఒక నవల ఆధారంగా రూపొందుతున్న తెలుగు సీరియల్లో నటిస్తోంది. తెలుగు చిత్రసీమలో స్థిరపడిన ఈ అందాలభామ జెమినీ టీ.విలో ప్రసారంకానున్న సీరియల్లో ప్రేక్షకులను అలరించనున్నది. ఆ సీరియల్‌ను వడ్డే రమేష్ నిర్మిస్తున్నారు.